# సాక్షి
## శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 25 । అక్టోబర్ । 2023






### ముగిసిన శరన్నవరాత్రులు

లేపాక్షి ఆలయంలోశరన్నవరాత్రుల ఉత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. 8లో



### టమాట కిలో రూ.10

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.5. సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
38.3°/15.5°

జిల్లాలో మంగళవారం పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గిపోయాయి. ఆగ్నేయం దిశగా గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

## న్యూస్‌రీల్

### అరుణాచలానికి ప్రత్యేక బస్సు

పుట్టపర్తి టౌన్: గిరి ప్రదక్షిణ సందర్భంగా ఈనెల 27న పుట్టపర్తి ఆర్టీసీ బస్టాండ్ నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ఇనయతుల్లా ఒక ప్రకటనలో తెలియజేశారు. వేలూరు గోల్డెన్ టెంపుల్, కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి దర్శనం కూడా చేసుకోవచ్చన్నారు. స్థానిక డిపో నుంచి ఉదయం 10 గంటలకు బస్సు బయలుదేరుతుందన్నారు. పుట్టపర్తి బస్టాండ్‌లో లేదా ఆన్‌లైన్‌లో టికెట్లు రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. వివరాలకు 7382860486, 9440201570 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

### 27లోపు బయోమెట్రిక్ వివరాలు పంపాలి

అనంతపురం రూరల్: కేంద్ర ప్రభుత్వం 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి అందించే మైనార్టీ ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల బయోమెట్రిక్ వివరాలను ఈ నెల 27లోపు జిల్లా నోడల్ అధికారి లాగిన్‌కు పంపాలని ఉమ్మడి జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మహమ్మద్‌రఫీ కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపకార వేతనాల కోసం ఉమ్మడి జిల్లాలో 9, 10 తరగతులు, ఇంటర్, డిగ్రీ, బీటెక్, వివిధ వృత్తి కోర్సుల మైనార్టీ విద్యార్థులు 7,006 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో ఇప్పటి వరకు 6,766 మంది వివరాలను మాత్రమే జిల్లా నోడల్ అధికారి లాగిన్‌కు పంపారని పేర్కొన్నారు. మిగిలిన విద్యార్థుల వివరాలను శుక్రవారం లోగా పంపితేనే స్కాలర్ షిప్ నగదు జమ అవుతుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు వీలైనంత త్వరగా వివరాలు పంపించాలన్నారు.

### చిరుత దాడిలో మేకల మృతి



మృతి చెందిన మేకలు

రొళ్ల: చిరుత దాడిలో 5 మేకలు మృతి చెందాయి. ఒక మేక తీవ్ర గాయాలపాలైంది. మండలంలోని ఎల్ కేపల్లి వడ్రహట్టి గ్రామంలో మంగళవారం సాయంత్రం ఘటన జరిగింది. వివరాలు.. ఎల్‌కే పల్లి వడ్రహట్టి గ్రామానికి చెందిన గోవిందరాజు తన వక్కతోటలో మేకల మందను వదిలి ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలోనే చిరుత వాటిపై పంజా విసిరింది. 5 మేకలను చంపేసింది. మరో మేకను నోటితో కరుచుకుని పరుగులు తీస్తుండగా, స్థానికులు కేకలు వేయడంతో విడిచిపెట్టి వెళ్లిపోయింది. 5 మేకల మృతితో రూ.80 వేల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. అటవీ శాఖ ఏబీఓ సంజీవరాయుడు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వం ద్వారా నష్ట పరిహారం అందిస్తామని భరోసా ఇచ్చారు.



అశ్వవాహనంపై ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి



హిందూపురంలో అమ్మవారి ఉత్సవమూర్తుల ఊరేగింపులో కోలాహలం



పుట్టపర్తి మండలం మామిళ్లకుంట క్రాస్ లలితా ఆలయంలో హోమంలో పాల్గొన్న మహిళలు

● అంగరంగ వైభవం..

## దసరా సంబరం

దసరా ఉత్సవాలు మంగళవారం జిల్లా వ్యాప్తంగా అంగరంగ వైభవంగా సాగాయి. అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పూజలు, హోమాల్లో పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో శమీ వృక్షాన్ని దర్శించుకున్నారు. ఎడ్లబండ్లు, వాహనాల సవారీ చేయించారు. శమీ పత్రిని మిత్రులు, పెద్దలకు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. పలు గ్రామాల్లో ఎడ్లబండ్ల పోటీలు సందడిగా సాగాయి. – సాక్షి బృందం

# ఆంధ్రా పోలీసులు ఆదర్శం



అనంతపురం పీటీసీలో సోమవారం జరిగిన ప్రొబేషనరీ డీఎస్పీల పాసింగ్ అవుట్‌పరేడ్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న హోం మంత్రి తానేటి వనిత, చిత్రంలో డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి



కార్యక్రమానికి హాజరైన విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీలు తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తదితరులు



చిన్నారితో నూతన మహిళా డీఎస్పీ



కుటుంబ సభ్యులతో ఆనందం పంచుకుంటున్న నూతన డీఎస్పీ ఉషశ్రీ

### శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం

- నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించండి
- రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత పిలుపు
- ఘనంగా ప్రొబేషనరీ డీఎస్పీల పాసింగ్ అవుట్‌పరేడ్

అనంతపురం క్రైం: ఆంధ్రప్రదేశ్ పోలీసుల సేవలు ఇతర రాష్ట్రాలకు సైతం ఆదర్శంగా నిలుస్తున్నాయని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత ప్రశంసించారు. అనంతపురం పోలీసు శిక్షణ కళాశాల(పీటీసీ)లో 28 మంది ప్రొబేషనరీ డీఎస్పీల శిక్షణ పూర్తయ్యింది. ఈ సందర్భంగా సోమవారం పీటీసీ ఆవరణలో ట్రైనీ డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్ ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హోం మంత్రి తానేటి వనిత, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి హాజరయ్యారు. పీటీసీ ప్రిన్సిపాల్/ఐజీ వెంకట్రామిరెడ్డితో కలసి వారు ప్రత్యేక వాహనంలో పరేడ్‌ను పరిశీలించారు. అనంతరం ప్రొబేషనరీ డీఎస్పీలతో ప్రిన్సిపాల్ రాజ్యాంగబద్ధ ప్రమాణం చేయించారు. డీఎస్పీలనుద్దేశించి హోంమంత్రి మాట్లాడుతూ పోలీసు వ్యవస్థలో కేసుల విచారణ నుంచి శాంతిభద్రతల పరిరక్షణ వరకు కీలకమైన బాధ్యతలు డీఎస్పీలు నిర్వర్తించాల్సి ఉంటుందన్నారు. ఉన్నతాధికారుల నిర్ణయాలు అమలు చేస్తూనే కిందిస్థాయి అధికారులు, సిబ్బంది చేత సమర్థవంతంగా పనిచేయించాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల రక్షణ ప్రథమ కర్తవ్యంగా భావించి విధులు నిర్వర్తించాలన్నారు. ప్రజలకు నిష్పక్షపాతంగా సేవలందించాలని సూచించారు. డీఎస్పీ అంటే...డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా అందరం పిలుస్తామని, ఇక నుంచి మీ పనితీరుతో 'డెడికేటెడ్ సక్సెస్ ఫుల్ పోలీస్'గా పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. నేడు మన ఆంధ్రప్రదేశ్ పోలీస్ వ్యవస్థ దేశానికే అనేక విషయాల్లో ఆదర్శంగా నిలిచిందన్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ అద్భుతంగా ఉందన్నారు. ఇదంతా డీజీపీ నుంచి కిందిస్థాయి అధికారి, సిబ్బంది వరకు చిత్తశుద్ధితో పనిచేయడం వల్లనే సాధ్యమయ్యిందని కొనియాడారు. మహిళల భద్రత కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశ యాప్ ప్రవేశపెట్టి.. పోలీస్ స్టేషన్లు అందుబాటులోకి తెచ్చారన్నారు. నూతన డీఎస్పీలు ఇదేస్ఫూర్తితో పనిచేయాలని సూచించారు.

#### పారదర్శకంగా పనిచేయండి

ఇగోయిజానికి పోకుండా, అందరినీ సమానంగా చూస్తూ పారదర్శకంగా సేవలందించాలని డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి సూచించారు. అన్ని వర్గాల ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. ఒత్తిళ్లకు లోనుకాకుండా నిష్పక్షపాతంగా విధుల్లో వ్యవహరించాలని డీఎస్పీలకు సూచించారు. స్టేషన్‌కు వచ్చే బాధితులకు చట్టపరంగా న్యాయం జరిగేలా చూడాలన్నారు. రాష్ట్రంలో గత ఏడాది 122 కీలక కేసుల దర్యాప్తుల పర్యవేక్షణను ఎస్పీలకు అప్పగించామన్నారు. ఈ కేసులన్నింటిలోను ముద్దాయిలకు శిక్షలు పడటం ముదావహమన్నారు. ఈ ఏడు కూడా ఎస్పీలకు 50 కేసులు అప్పగించగా ఇప్పటికే 30 వరకు కేసుల్లో శిక్షలు పడ్డాయన్నారు. మహిళల భద్రత కోసం దిశ యాప్, అవినీతి నిరోధక అప్లికేషన్‌లు ఉన్నాయని, వాటిని విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. సోషల్ మీడియా పోకడలను నియంత్రించేందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక టీంలు సిద్ధం చేశామన్నారు. సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టిపెట్టామన్నారు. గంజాయి నియంత్రణకు గట్టి చర్యలు తీసుకున్నామని తెలిపారు. గ్రేవ్ కేసుల దర్యాప్తులో నైపుణ్యం సాధించాలన్నారు. శిక్షణ సమయంలో ఫైరింగ్, ఇండోర్, అవుట్ డోర్ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన ప్రొబేషనరీ డీఎస్పీలకు హోం మంత్రి చేతుల మీదుగా పతకాలు, ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీలు తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, మేయర్ వసీం,పీటీసీ వైస్ ప్రిన్సిపాల్ గీతాదేవి, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఎస్పీలు కేకేఎన్ అన్బురాజన్, ఎస్వీ మాధవరెడ్డి, ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ గంగాధరరావు, అదనపు ఎస్పీలు జి.మల్లికార్జునవర్మ, ఆర్.విజయభాస్కర్ రెడ్డి, జి.రామకృష్ణ, డీఎస్పీలు అల్లా బకాష్, హరినాథరెడ్డి, శ్రీనివాసులు, నాగభూషణ, దేవదాస్, బి.శ్రీనివాసులు, సీఎం గంగయ్య, నరసింగప్ప, నగర రిటైర్డ్ ఐజీ సూర్యప్రకాష్, పలువురు సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.



నూతన డీఎస్పీలతో సెల్ఫీ దిగుతున్న యువతి

# మార్మోగిన సాయినామం



వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు

ప్రశాంతి నిలయం: ప్రశాంతి నిలయంలో విజయ దశమి వేడుకలు ఘనంగా జరిగాయి. అశేష భక్తకోటితో సాయినామస్మరణ మార్మోగింది. విశ్వ శాంతిని కాంక్షిస్తూ పూర్ణచంద్ర ఆడిటోరియం వేదికగా చేపట్టిన వేదపురుష సప్తాహ జ్ఞాన యజ్ఞం మంగళవారం పూర్ణాహుతితో ముగిసింది. వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. వేదపండితులు శ్రీమన్నారాయణ దంపతులు వేదమంత్రోచ్ఛారణ నడుమ యజ్ఞద్రవ్యాలను సమర్పిస్తూ సంప్రదాయ రీతిలో పూర్ణాహుతి గావించారు. పుణ్యజలాన్ని భక్తకోటిపై సంప్రోక్షణ గావించారు. భక్తులు సత్యసాయిని కీర్తిస్తూ భక్తిగీతాలు ఆలపించారు.వేడుకల్లో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు, సభ్యుడు చక్రవర్తి, కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ మాధవరెడ్డి, మాజీ మంత్రి గీతారెడ్డి, పలువురు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ప్రతినిధులు, సత్యసాయి సంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

#### అలరించిన నృత్య ప్రదర్శన

వేడుకల్లో భాగంగా సోమవారం సాయంత్రం సాయి కుల్వంత్ సభా మందిరంలో నిర్వహించిన చిన్నారుల నృత్య ప్రదర్శన అలరించింది. సత్యసాయి విద్యా సంస్థల ప్రొఫెసర్ డాక్టర్ శైలేష్ శ్రీవాస్తవ సత్యసాయి వైభవాన్ని వివరిస్తూ ప్రసంగించారు.



పూర్ణాహుతి ఇస్తున్న వేదపండితులు

వేడుకల్లో పాల్గొన్న భక్తులు



# అక్కచెల్లెమ్మలకు అగ్రస్థానం

- మహిళలకు సీఎం జగన్ ఆర్థిక తోడ్పాటు
- ఏటా ఠంచనుగా పథకాలతో లబ్ధి
- వైకేపీ ద్వారా నాలుగేళ్లలో రూ.8,029 కోట్ల అందజేత

పుట్టపర్తి అర్బన్: మహిళా సాధికారతే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విప్లవాత్మక చర్యలు తీసుకుంటోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా అక్కచెల్లెమ్మల కోసం సీఎం వైఎస్ జగన్ పథకాలను ప్రవేశ పెట్టారు. నాలుగేళ్లలో రికార్డు స్థాయిలో లబ్ధి చేకూర్చారు. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, సున్నా వడ్డీ, బ్యాంకు లింకేజీ రుణాలు, వైఎస్సార్ పెన్షన్ కానుక, వైఎస్సార్ బీమా, జగనన్న తోడు వంటి పథకాల ద్వారా 8,25,517 మంది మహిళలకు నాలుగేళ్లలో ఏకంగా రూ. 8,029.69 కోట్లు అందించారు. ఇంతలా మహిళలను ఆదుకున్న ప్రభుత్వం దేశంలోనే ఎక్కడా లేదంటే ఆశ్చర్యం కలగకమానదు.

#### చెప్పాడంటే చేస్తాడంతే..

తానేదైనా మాట ఇచ్చాడంటే తప్పకుండా చేస్తాడ నేంతలా సీఎం వైఎస్ జగన్ పేరు తెచ్చుకున్నారు. 2014 ఎన్నికల సమయంలో డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామంటూ ప్రకటించిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక కుచ్చుటోపీ పెట్టాడు. కానీ, గత ఎన్నికల ముందు ఆ మేరకు హామీ ఇచ్చిన సీఎం వైఎస్ జగన్ మాత్రం మాట తప్పలేదు. 2019 మే మాసం వరకూ మహిళలకు బ్యాంకుల్లో ఎంత రుణం ఉంటుందో దాన్ని వైఎస్సార్ ఆసరా కింద నాలుగు విడతలుగా మాఫీ చేస్తూ 2,76,866 మందికి రూ.541.37 కోట్లు అందజేశారు. ఇక.. జిల్లాలో స్వయం సహాయక సంఘాల మహిళలు 30,957 మంది ఉన్నారు. వీరిలో రుణ కంతులను సకాలంలో చెల్లించిన 30,957 మందికి సున్నా వడ్డీ కింద నాలుగేళ్లలో రూ.51.21 కోట్లు ఖాతాల్లో వేశారు. 45–60 సంవత్సరాల్లోపు మహిళల జీవనోపాధుల పెంపునకు 'వైఎస్సార్ చేయూత' కింద ఏడాదికి 18,500 చొప్పున నాలుగేళ్లలో 1,11,189 మందికి రూ.580.61 కోట్లు పంపిణీ చేశారు. కుటుంబ పెద్ద మృతి చెందితే కుటుంబ సభ్యులకు సాయం అందించే వైఎస్సార్ బీమా కింద 3,636 మంది మహిళలకు రూ.6.18 కోట్లు అందించడం గమనార్హం.



వైఎస్సార్ చేయూత ద్వారా అందిన డబ్బుతో ఏర్పాటు చేసుకున్న పిండి మిషన్

**నాలుగేళ్లలో జిల్లా మహిళలకు అందించిన ఆర్థిక సాయం ఇలా..**

| పథకం | సాయమందుకున్న వారు | లబ్ధి (రూ.కోట్లలో) |
|---|---|---|
| వైఎస్సార్ ఆసరా | 2,76,866 | 541.37 |
| వైఎస్సార్ చేయూత | 1,11,189 | 580.61 |
| సున్నా వడ్డీ రుణాలు | 30,957 | 51.21 |
| వైఎస్సార్ బీమా | 3636 | 6.18 |

#### ప్రగతి పథంలో..

ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన మహిళలు చిరు వ్యాపారాలు ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతున్నారు. మహిళా మార్టులు, పిండి మిషన్లు, చిల్లర దుకాణాలు, స్వీట్లు, తినుబండారాల వ్యాపారం, పట్టణాల్లో 'ఆహా' క్యాంటీన్లు, రొట్టెల తయారీ, పాడి పశువుల పెంపకం, పెరటి కోళ్లు, పొట్టేళ్ల పెంపకం, అగర్‌బత్తీల తయారీ వంటి వ్యాపారాలు చేసుకుంటూ రాణిస్తున్నారు. రుణాల కంతులను సకాలంలో చెల్లిస్తూ ప్రగతి పథంలో దూసుకెళ్తున్నారు.

#### సంతోషంగా ఉంది



రుణమాఫీ చేస్తానని చెప్పి చంద్రబాబు మోసం చేశారు. కానీ, జగనన్న మాత్రం ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. అక్కచెల్లెమ్మలకు అండగా నిలబడ్డారు. తన తండ్రి వైఎస్సార్‌లా ప్రతి పథకంలో పేదలకు పెద్దపీట వేస్తున్నారు. ఇంత కంటే ప్రజలకేం కావాలి. ఇలాంటి సీఎం ఉంటే పేదలకు ఇబ్బందే ఉండదు. – కవిత, ప్రశాంతిగ్రామం

#### పథకాలన్నీ మహిళలకే



ప్రతి పథకంలోనూ మహిళలకు పెద్ద పీట వేస్తున్నారు. కుటుంబ పోషణకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చేస్తున్నారు. పథకాలను వలంటీర్ల ద్వారా పారదర్శకంగా అమలు చేస్తున్నారు. మహిళలకు ఈ పథకాలు ఎంతో తోడ్పాటునందిస్తున్నాయి. వైఎస్ జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం. – సరస్వతి, అమగొండపాళ్యం

#### దేశానికే ఆదర్శం..



గతంలో ఎన్నడూ ఇలాంటి పథకాలు అమలు కాలేదు. ఇంత పెద్ద ఎత్తున మహిళా సంక్షేమం చూడలేదు. ప్రభుత్వ చేయూతతో చిరు వ్యాపారాలు చేసుకుంటూ, చేతి వృత్తుల్లో రాణిస్తూ మహిళలు ఆదర్శంగా నిలుస్తున్నారు. కుటుంబ పోషణకు ఎలాంటి ఢోకా లేదు. కరోనా కష్ట కాలంలోనూ పథకాలను అమలు చేశారు. మహిళా సాధికారతలో మన రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలుస్తోంది. – నరసయ్య, పీడీ, డీఆర్‌డీఏ

## క్లుప్తంగా

### హోం మంత్రిని కలిసిన ఎస్పీ మాధవరెడ్డి



హోంమంత్రి తానేటి వనితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: రాష్ట్ర హోం మంత్రి తానేటి వనితని ఎస్పీ మాధవరెడ్డి మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. సోమవారం అనంతపురం పోలీసు శిక్షణా కళాశాలలో జరిగిన పాసింగ్ అవుట్ పరేడ్ ఆఫ్ ప్రొబేషనరీ డీఎస్పీ–2022 కార్యక్రమానికి హోం మంత్రి ముఖ్య అతిథిగా హాజరైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా హోం మినిస్టర్‌తో పాటు డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డిని ఎస్పీ మాధవరెడ్డి మర్యాదపూర్వకంగా కలసి మాట్లాడారు.

### జూదరుల అరెస్ట్

బత్తలపల్లి: మండలంలోని నల్లబోయనపల్లి ఇసుక రీచ్ సమీపంలో పేకాట ఆడుతున్న పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం డి.చెర్లోపల్లి పొలాల్లో పెద్ద ఎత్తున పేకాట ఆడుతున్నట్లుగా సమాచారం అందడంతో పోలీసులు తనిఖీలు చేపట్టినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆ సమయంలో పేకాట ఆడుతున్న 11 మంది పట్టుబడ్డారన్నారు. వీరి నుంచి రూ.37 వేలు స్వాధీనం చేసుకుని, మంగళవారం న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు వివరించారు.

### రిపబ్లిక్ డే ప్రాబబుల్స్‌కు 65 మంది క్యాడెట్లు

- 27 నుంచి సికింద్రాబాద్‌లో పోటీలు



శిక్షణ పొందుతున్న క్యాడెట్లు

కూడేరు: న్యూఢిల్లీలో జనవరి 26న జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనే ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక ప్రక్రియ మొదలైంది. ఈ క్రమంలో కూడేరు మండలం ఎన్‌సీసీ నగర్‌లో 65 మంది ప్రాబబుల్స్‌ను ఎంపిక చేశారు. క్యాంప్‌లో ఎన్‌సీసీ అధికారులు ఎస్‌ఎం కేకే సింగ్, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు చెందిన 450 మంది క్యాడెట్లు పాల్గొన్నారు. ఎంపికైన వారు ఈ నెల 27న సికింద్రాబాద్ వేదికగా జరిగే పోటీలకు హాజరు కావాల్సి ఉంటుంది. ఈ మేరకు ఎన్‌సీసీ క్యాంప్ కమాండర్ కల్నల్ అక్షయ్ మాథుర్ మంగళవారం తెలిపారు. నవంబర్ 5 వరకూ జరిగే ఈ పోటీలకు 9 ట్రూపులు పాల్గొంటాయన్నారు. ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసి డిసెంబర్‌లో ప్రత్యేక శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు.

# లేపాక్షిలో ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు



మహిషాసురమర్దిని అలంకరణలో దుర్గాదేవి మూలవిరాట్





లేపాక్షిలో శివపార్వతుల ఉత్సవ మూర్తులను గ్రామోత్సవానికి సిద్ధం చేసిన దృశ్యం, సడ్లపల్లిలో శమీవృక్షం వద్ద పూజలు చేస్తున్న గ్రామపెద్దలు

లేపాక్షి: ప్రసిద్ధి చెందిన లేపాక్షి వీరభద్రస్వామి ఆలయంలో ఈ నెల 15న ప్రారంభమైన శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ముగిసాయి. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహామూర్తి పర్యవేక్షణలో దుర్గాదేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేసారు. శివపార్వతుల ఉత్సవ మూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం నంది విగ్రహం వద్ద శమీవృక్షానికి ప్రత్యేక పూజలు చేసారు. చోళసముద్రంలో చౌడేశ్వరిదేవి అమ్మవారిని ఊరేగింపుగా శమీ వృక్షం వద్దకు చేర్చి పూజలు చేశారు. ఆ గ్రామానికి చెందిన సమాజసేవకుడు కరణం రామానందన్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. గ్రామపెద్దలు ఎన్‌ఆర్‌ఐ కేశవమూర్తి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ నారాయణస్వామి, ప్రభాకరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. పి.సడ్లపల్లిలో అశ్వత్థ నారాయణస్వామి, కల్లూరులో చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తుల గ్రామోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు.

## పెన్నా పాత బ్రిడ్జి పైనుంచి పడి వ్యక్తి మృతి



మృతుడు వెంకటశివారెడ్డి

హిందూపురం అర్బన్: పెన్నా పాత బ్రిడ్జిపై నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కర్ణాటకలోని కొడిగేహళ్లి పంచాయతీ రెడ్డిపల్లి గ్రామానికి చెందిన వెంకటశివారెడ్డి (51)కి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెనుకొండ సమపంలోని కియా అనుబంధ పరిశ్రమలో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఏడాది క్రితం కురిసిన వర్షాలకు రెడ్డిపల్లి – హిందూపురం మధ్యమార్గంలో పోచనపల్లి వద్ద ఉన్న పెన్నానది బ్రిడ్జి కూలిపోయింది. దీంతో అక్కడ తాత్కాలిక బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పోచనపల్లి, ఊడుగలపల్లి, బేవనహళ్లి తదితర కర్ణాటక ప్రాంత ప్రజలు తాత్కాలిక బ్రిడ్జి మీదనే రాకపోకలు సాగిస్తున్నారు. అయితే మంగళవారం వేకువజామున విధులకు హాజరయ్యే హడావుడిలో రెడ్డిపల్లి నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరిన వెంకట శివారెడ్డి.. అనాలోచితంగా పాత బ్రిడ్జి మార్గంలోకి దూసుకెళ్లి.. పై నుంచి బ్రిడ్జి శిథిలాలపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఉదయం అటుగా వెళ్లిన పోచనపల్లి గ్రామస్తులు గుర్తించి సమాచారం అందించడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద లభ్యమైన ఆధారాలను బట్టి వెంకటశివారెడ్డిగా గుర్తించి, కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఘటనపై హిందూపురం రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

## ఇంట్లో చొరబడి విందు.. ఆపై లూటీ



దుండగులు లూటీ చేసిన ఇల్లు



ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

పుట్టపర్తి రూరల్: తాళం వేసిన ఇంట్లోకి చొరబడి విందు చేసుకుని ఆపై సమస్త వస్తువులనూ దోచుకెళ్లిన ఘటన పుట్టపర్తిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. పుట్టపర్తిలోని సత్యసాయి ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తున్న తిరుపాలమ్మ స్థానిక చిన్నపల్లి హైస్కూల్ సమీపంలో నివాసముంటోంది. అనారోగ్యంతో బాధపడుతున్న తన కుటుంబసభ్యులను తీసుకుని ఇంటికి తాళం వేసి నెల క్రితం ఆమె బెంగళూరుకు వెళ్లారు. సోమవారం తిరిగి వచ్చారు. అప్పటికే తలుపులు బద్దలుగొట్టి ఉండడం గమనించి లోపలకు వెళ్లి పరిశీలించారు. ఇంట్లో ఫ్యాన్లు, లైట్లు, కొళాయిలు, మోటారు, ఇతర సామగ్రి మొత్తం లూటీ చేసినట్లు గుర్తించి సమాచారం అందించడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఏఎస్‌ఐ గంగన్న, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. దుండగులు ఇంట్లోకి చొరబడిన తర్వాత అక్కడే గంటల పాటు సేద తీరినట్లుగా ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. మద్యం సేవించి, విందు చేసుకున్నట్లుగా ఆనవాళ్లు ఉన్నాయి. అనంతరం మద్యం మత్తు దిగేంతవరకూ అక్కడే సేదతీరి ఆ తర్వాత ఇంటి మొత్తాన్ని లూటీ చేసుకెళ్లినట్లుగా నిర్ధారించారు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## సత్తాచాటిన జిల్లా వృషభాలు



బండలాగుతున్న వృషభాలు

రాచర్ల: ప్రకాశం జిల్లా రాచర్ల మండలం ఆకవీడులో జరిగిన బండ లాగుడు పోటీల్లో అనంతపురం జిల్లా వృషభాల సత్తా చాటాయి. శిరిడీ సాయిబాబా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా మంగళవారం ఉదయం 9 గంటలకు రాష్ట్ర స్థాయి రెండు పళ్ల వృషభాల బండలాగుడు పోటీలు నిర్వహించారు. మొత్తం 13 జతల వృషభాలు పాల్గొనగా, ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన బి.భావన వృషభాలు నిర్ణీత 20 నిమిషాల్లో 3,250 అడుగుల దూరం రాతి దూలాన్ని లాగి మొదటి బహుమతి సాధించాయి. అలాగే వైఎస్సార్ జిల్లా కలసపాడు మండలం నల్లగుండుపల్లి గ్రామానికి చెందిన వల్లూరి రవీంద్రారెడ్డి వృషభాలు 3,201 అడుగులు లాగి రెండో బహుమతి, ప్రకాశం జిల్లా అర్ధవీడు మండలం అచ్చంపేట గ్రామానికి చెందిన మామిళ్లపల్లె శ్రీనివాసరెడ్డి వృషభాలు 2,846 అడుగులు లాగి మూడో బహుమతి గెలుచుకున్నాయి. విజేత వృషభాల యజమానులకు వరుసగా నగదు పురస్కారాలతో నిర్వాహకులు సత్కరించారు.

## సూర్య, చంద్రప్రభ వాహనాలపై చింతల రాయుడి విహారం



చంద్రప్రభ వాహనంపై విహరిస్తున్న చింతల వెంకటరమణస్వామి

తాడిపత్రి అర్బన్: తాడిపత్రి పట్టణంలోని శ్రీచింతల వెంకటరమణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం స్వామివారు సూర్య, చంద్రప్రభ వాహనాలపై విహరించారు. ఉదయం సూర్యప్రభ వాహనంపై పుర వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి చంద్రప్రభ వాహనంపై ఊరేగారు. సర్వాంగ సుందరంగా ముస్తాబైన స్వామి వారిని భక్తులు దర్శించుకుని కర్పూర నీరాజనాలు అర్పించారు. పురవీధులు గోవింద నామస్మరణతో మార్మోగాయి.

## అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

- బంగారు ఆభరణాలు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బంగారు నగలు, చోరీకి వినియోగించే పరికరాలు చూపుతున్న పోలీసులు

అనంతపురం క్రైం: అంతర్ జిల్లా దొంగను అరెస్ట్ చేసి, రూ.8 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రెండు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక సీసీఎస్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలను అనంతపురం సీసీఎస్, పెద్దపప్పూరు పోలీసులు వెల్లడించారు. యాడికి నివాసి సరవ్ భాస్కరాచారి విడపనకల్లు మండలం కడదరబెంచి గ్రామానికి మకాం మార్చి కూలీ పనులతో జీవనం సాగించేవాడు. ఒంటరి జీవనానికి అలవాటు పడిన భాస్కరాచారి మద్యం, చెడు అలవాట్లకు బానిసయ్యాడు. కూలీ పనులతో వచ్చే ఆదాయం అతని అవసరాలకు సరిపోకపోవడంతో దొంగతనాలు చేయడం ప్రారంభించాడు. 13 ఏళ్లుగా చోరీలు చేస్తూ పలుమార్లు పోలీసులకు పట్టుబడి జైలు పాలయ్యాడు. తాళం వేసిన గృహాలు, ఆలయాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడేవాడు. గుత్తి, కసాపురం, విడపనకలు, గుంతకల్లు, కర్నూలు జిల్లా పత్తికొండ, తుగ్గలి పోలీసు స్టేషన్లలో 11 చోరీ కేసులు నమోదయ్యాయి. ఈ నెల 22న పెద్దపప్పూరు మండలం జూటూరు శివారులో అనుమానాస్పదంగా తచ్చాడుతుంటే పోలీసులు అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేశారు. దీంతో చోరీలు వెలుగు చూశాయి. రూ. 8 లక్షలు విలువ చేసే బంగారు నగలతో పాటు రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. విలేకరుల సమావేశంలో సీసీఎస్ సీఐ జీటీ నాయుడు, యాడికి సీఐ శంకర రెడ్డి, పెద్దపప్పూరు ఇన్‌చార్జ్ ఎస్‌ఐ గురుప్రసాదరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

- సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్ రాజు



మొబైల్ బస్సును ప్రారంభిస్తున్న రత్నాకర్ రాజు, చక్రవర్తి

ప్రశాంతి నిలయం: గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్ రాజు తెలిపారు. సత్యసాయి సంచార వైద్యశాల నూతన మొబైల్ బస్సు (సంజీవని)ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజల చెంతకే వెళ్లి మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో సత్యసాయి సంచార వైద్య శాలను ప్రారంభించారన్నారు. పూర్వపు సత్యసాయి తాలూకాతో పాటు చుట్టుపక్కల గల 12 మండలాల్లోని గ్రామాలకే వెళ్లి రోజూ వైద్య సేవలను అందిస్తున్నామన్నారు. ఇప్పటి వరకూ 250 గ్రామాల ప్రజలకు సత్యసాయి సంచార వైద్య సేవల ద్వారా వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో ఆధునికీకరించినట్లు పేర్కొన్నారు. డిజిటలైజ్డ్ ఎక్స్‌రే మిషన్, అల్ట్రాసౌండ్ డాప్లర్ సౌకర్యం, రెండు చైర్‌లతో కూడని ఆప్తాల్మిక్ యూనిట్, లేబొరేటరీ సౌకర్యం ఉంటాయన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు చక్రవర్తి, మొబైల్ వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యువకుడి దుర్మరణం



ఈరన్న (ఫైల్)

రొళ్ల: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... రొళ్ల మండలం పిల్లిగుండ్ల గ్రామానికి చెందిన లక్ష్మప్ప, మారెక్క దంపతుల రెండో కుమారుడు ఈరన్న (28) బెంగళూరులో మెడికల్ రెప్‌గా పని చేస్తున్నాడు. దసరా పండుగను పురస్కరించుకుని స్వగ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో తమ ఇలవేల్పు అయిన పావగడ తాలూకా నిడుగల్‌లో వెలసిన సులధీరప్పస్వామి దర్శనానికి ద్విచక్ర వాహనంపై వెళుతూ చిట్నడుకు వద్దకు చేరుకోగానే వాహనం అదుపు తప్పి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి తల్లిదండ్రులతో పాటు ఓ సోదరి ఉన్నారు. ఘటనపై అరసికెర పోలీసులు కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, జేసీఎస్ కన్వీనర్ నాగేంద్ర తదితరులు పిల్లిగుండ్ల గ్రామానికి చేరుకుని ఈరన్న మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులను ఓదార్చారు.

## జామ తోటకు నిప్పు

బెళుగుప్ప: ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి జామ తోట దగ్ధమైంది. గ్రామస్తులు తెలిపిన మేరకు... బెళుగుప్ప మండలం దుద్దేకుంటకు చెందిన రైతు హనుమంతరాయుడు తనకున్న 13 ఎకరాల్లో మూడేళ్ల క్రితం 20 వేల జామ మొక్కలు నాటారు. ప్రస్తుతం పంట కోతకు వచ్చింది. సోమవారం ఉదయం పండుగ పూట అందరూ గ్రామంలోనే ఉండిపోయారు. ఆ సమయంలో నిప్పు రాజుకుని తోటను చుట్టుముట్టింది. ఒక్కసారిగా మంటలు ఎగిసి పడుతుండడం గమనించిన గ్రామస్తులు అక్కడకు చేరుకుని ఆర్పేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకునే లోపు జామచెట్లతో పాటు డ్రిప్ పరికరాలు, కొబ్బరి మొక్కలు కాలిపోయాయి. చుట్టుపక్కల తోటలకు మంటలు వ్యాపించకుండా అగ్నిమాపక సిబ్బంది ఆర్పివేశారు. ఘటనలో దాదాపు రూ.20 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

## ఆటో బోల్తా – బాలుడి మృతి

గుత్తి: ఆటో బోల్తాపడిన ఘటనలో ఓ బాలుడు మృతి చెందాడు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం ఎర్రగుడి గ్రామానికి చెందిన సురేంద్ర (13)ని వెంట బెట్టుకుని అదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఆంజనేయులు చెరువు తండా గ్రామానికి వెళ్లాడు. టమాట పంట లోడు చేసుకుని తిరిగి ఎర్రగుడికి బయలుదేరిన వారు చెరువు తండా శివారులోకి చేరుకోగానే ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆంజనేయులు, సురేంద్రను స్థానికులు వెంటనే గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సురేంద్ర పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం వైద్యుల సూచన మేరకు అంబులెన్స్‌లో అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించడంతో పోస్టుమార్టం నిమిత్తం తిరిగి గుత్తి ప్రభుత్వాస్పత్రికి చేర్చారు. ఘటనపై గుత్తి పోలీసులు కేసు నమోదు చేసి తుగ్గలి పోలీసులకు బదిలీ చేశారు.

## నేత్రపర్వం.. రథోత్సవం

బెళుగుప్ప: మండలంలోని ప్రముఖ పుణ్య క్షేత్రం బూదిగుమ్మలో వెలసిన పద్మావతీ సమేత వేంకటరమణస్వామి ఆలయంలో సోమవారం రథోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో అమ్మవారిని మహిసాసురమర్దిని అలంకరణ చేశారు. వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు, అలంకరణలు జరిగాయి. అనంతరం ప్రధాన అర్చకుడు వాసుదేవస్వామి నేతృత్వంలో పల్లకీసేవ నిర్వహించారు. ఉత్సవ మూర్తులను రథంపైకి చేర్చి పూజల అనంతరం గోవింద నామ స్మరణతో భక్తులు లాగారు. జెడ్పీటీసీ సభ్యురాలు కుమ్మెత మమత, త్రిలోక్‌రెడ్డి దంపతులు, గ్రామ సర్పంచ్ రామకృష్ణమ్మ, కేశవరెడ్డి దంపతులు, ఎంపీటీసీ వీరబొమ్మన్న, ఆలయాల కమిటీ చైర్మన్లు తిమ్మారెడ్డి, ఈశ్వరమ్మ, సేవాకమిటీ జయేంద్రశర్మ, గోవిందరెడ్డి, జి.కేశవరెడ్డి, దేవాదాయశాఖ అధికారి అక్కిరెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

## దంపతులకు రిమాండ్

గాండ్లపెంట: అక్రమంగా విద్యుత్ కంచె ఏర్పాటు చేసి వ్యక్తి మృతికి కారణమైన కేసులో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన మేరకు... గాండ్లపెంట మండలం సామలగొంది పంచాయతీ సింగానివారి పల్లికి చెందిన కె.రామచంద్రనాయుడు (45) ఈ నెల 18న కురుమామిడి సమీపంలో రైతు గంగిశెట్టి పొలానికి అక్రమంగా ఏర్పాటు చేసుకున్న విద్యుత్ కంచె తగిలి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషయం వెలుగు చూడకుండా రైతు గంగిశెట్టి, తన కుటుంబసభ్యులతో కలసి రామచంద్రనాయుడు మృతదేహాన్ని తీసుకెళ్లి వ్యవసాయ బావిలో పడేశాడు. ఘటనపై మృతుడియ కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు పక్కా ఆధారాలతో గంగిశెట్టి, అతని భార్య లక్ష్మీదేవిని సోమవారం రెక్కమాను వద్ద అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

## ఎంజీ మోటార్స్ షోరూం ప్రారంభం



షోరూం ప్రారంభిస్తున్న ఉదయ్‌కుమార్‌రెడ్డి

అనంతపురం సెంట్రల్: వందేళ్ల చరిత్ర కలిగిన బ్రిటీష్ కంపెనీ ఎంజీ మోటార్స్ షోరూంను అనంతపురంలోని జాతీయ రహదారిలో ఏర్పాటు చేశారు. మంగళవారం షోరూం అధినేత ఉదయ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, ఎంజీ మోటార్స్ డిప్యూటీ ఎండీ గౌరవ్‌గుప్తా తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఎంజీ కంపెనీలో భాగస్వాములు కావడం ఆనందంగా ఉందని ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నెల్లూరుతో పాటు రాయలసీమ జిల్లాల్లో షోరూంలు ఏర్పాటు చేశామన్నారు. అత్యాధునిక టెక్నాలజీ, ఫీచర్స్ గల ఎంజీ ఆస్టర్, హెక్టార్, గ్లోస్టర్ మోడల్ వాహనాలతో పాటు విద్యుత్ వాహనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కస్టమర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## హాకీ బాలికల టోర్నీ విజేత 'ఏపీ'

- రాణించిన జిల్లా క్రీడాకారిణులు



విజయోత్సాహంతో మైదానాన్ని చుట్టి వస్తున్న క్రీడాకారులు

అనంతపురం: హాకీ ఇండియా సబ్ జూనియర్ బాలికల సౌత్ జోన్ చాంపియన్‌షిప్–2023ను ఏపీ జట్టు కైవసం చేసుకుంది. ఈ జట్టులో అనంతపురం జిల్లాకు చెందిన ఆర్డీటీ క్రీడాకారులే ఎక్కువగా ఉండడం గమనార్హం. చెన్నైలోని మేయర్ రాధాకృష్ణ ఆస్ట్రో టర్ఫ్ హాకీ గ్రౌండ్‌లో మంగళవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తమిళనాడు జట్టుతో తలపడిన ఏపీ జట్టు 5–0 గోల్స్ తేడాతో ఘన విజయం సాధించింది. జట్టులో శ్రీవిద్య మూడు గోల్స్, ముజీయాబేగం, తులసి చెరో గోల్ చేశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా శ్రీవిద్య నిలిచారు. జట్టు విజయంపై ఏపీ ఆర్కిటెక్చర్ నిరంజన్‌రెడ్డి, హాకీ ఆంధ్రప్రదేశ్ ప్రెసిడెంట్ చాణక్యరాజ్, సెక్రెటరీ హర్షవర్ధన్, వైస్ ప్రెసిడెంట్ సూర్య ప్రకాష్, ఏపీ ట్రెజరర్ థామస్, వైఎస్సార్‌సీపీ సౌత్ జోన్ ఇన్‌చార్జ్ బీసీ రమేష్‌గౌడ్, అనంతపురం జిల్లా సెక్రెటరీ, టీం మేనేజర్ అనిల్‌కుమార్, కోచ్ ఆర్.దేవకి హర్షం వ్యక్తం చేశారు.

## కర్ణాటక మద్యం పట్టివేత

పుట్టపర్తి టౌన్: జిల్లా టాస్క్‌ఫోర్స్, సెబ్ అధికారులు మంగళవారం పలుచోట్ల కర్ణాటక మద్యం పట్టుకున్నారు. ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు హిందూపురం, తనకల్లు సెబ్ స్టేషన్ల పరిధిలో దాడులు నిర్వహించారు. 86 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు, ఒక వాహనం స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. అలాగే ధర్మవరం సెబ్ స్టేషన్ పరిధిలో రావులచెరువు వద్ద 45 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

## గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

కనగానపల్లి: మండలంలోని దాదులూరు సమీపంలో మంగళవారం సాయంత్రం గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. దాదులూరు సమీపంలోని చింతవనం పక్కన పూర్తిగా కుళ్లిన స్థితిలో మృతదేహం పడి ఉంది. మృతురాలికి 45 ఏళ్లు ఉండవచ్చు. మహిళ మిస్సింగ్ కేసులో సంబంధీకులు ఎవరైనా ఉంటే కనగానపల్లి పోలీసులను సంప్రదించాలని ఎస్‌ఐ హనుమంత రెడ్డి, రామగిరి సీఐ చిన్నగౌస్ కోరారు.

## బంకును ఢీకొన్న బైక్ – యువకుడి మృతి

కళ్యాణదుర్గం: ద్విచక్ర వాహనం అదుపు తప్పి బంకును ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. మరో ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... కుందుర్పి మండలం ఎనుములదొడ్డి గ్రామానికి చెందిన గోపాల్ (20), శ్రావణ్, బాబు, మహమ్మద్ వ్యక్తిగత పనులపై సోమవారం కళ్యాణదుర్గం వచ్చారు. పని ముగించుకున్న అనంతరం నలుగురూ ఒకే ద్విచక్ర వాహనంపై రాత్రి 10 గంటలకు తిరుగు ప్రయాణమయ్యారు. గరుడాపురం వద్దకు చేరుకోగానే వేగాన్ని నియంత్రించుకోలేక రోడ్డు పక్కనే ఉన్న తలారి ఈరన్న బంకును ఢీకొని లోపలకు చొచ్చుకుపోయారు. ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో స్థానికులు ఇళ్లలో నుంచి బయటకు వచ్చి చూశారు. బంకు లోపలకు చొచ్చుకుపోయిన ద్విచక్ర వాహనాన్ని గమనించి సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని వెలికి తీసి, 108 అంబులెన్స్ ద్వారా కళ్యాణదుర్గం సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. కాగా, తలకు బలమైన గాయమైన గోపాల్ చికిత్సకు స్పందించక మంగళవారం ఉదయం మృతి చెందాడు.